మెడికల్ కాలేజీ ప్రయివేటీకరణను నిరసిస్తూ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం చేయడానికి తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకమని వైసిపి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథ రాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెం నుంచి పెనుమంట్రలోని బ్రాహ్మణచెరువు వరకూ వైసిపి నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రత్యేక వాన్‌లో భీమవరంలోని వైసిపి జిల్లా కార్యాలయానికి పంపుతున్న కోటి సంతకాల దస్త్రాల కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, మార్టేరు ఉపసర్పంచి కర్రి వేణుబాబు, పెనుమంట్ర, పోడూరు, ఆచంట, పెనుగొండ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీరంగనాథరాజు

సంక్రాంతికి రెఢీ..

- కోడిపందేలకు ఉమ్మడి జిల్లాలో ముందస్తు ఏర్పాట్లు
- ప్రత్యేక ట్రెయినర్లతో కోళ్లకు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు
- ఇప్పటికే సంక్రాంతికి హోటళ్లు బుకింగ్
- రెండు జిల్లాల్లో రూ.కోటీ 50 లక్షల వరకూ హోటళ్ల బిజినెస్
- కోడి పందేల బరుల ఏర్పాటుపై కూటమి నేతలు పోటీ

ప్రజాశక్తి - భీమవరం

తెలుగువారి సంప్రదాయ పండుగ సంక్రాంతి. ఎక్కడెక్కడో స్థిరపడిన వారు సంక్రాంతికి మాత్రం సొంత ఊరికొచ్చి ఇంటిల్లపాదీ ఆనందంగా పండగ జరుపుకుంటారు. సంక్రాంతి పండుగకు నెల రోజులు సమయం ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి పండుగకు ముందస్తు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఒకపక్క పందేలకు కోళ్లను రెడీ చేస్తున్నారు. ప్రత్యేక ట్రైనర్లతో కోళ్లకు శిక్షణ ఇస్తున్నారు. మరోపక్క హోటళ్లు అన్నీ అడ్వాన్స్ బుకింగ్ జరిగిపోతున్నాయి. ఇదిలా ఉంటే కోడిపందేల బరుల నిర్వాహకులు, పందెంరాయుళ్లు ఇప్పటికే బేరసారాలు మొదలు పెట్టేశారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగకు ఉమ్మడి జిల్లా రెడీ అవుతోంది.

సంక్రాంతి సాంప్రదాయ ముసుగులో కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహించడం ఏటా పరిపాటిగా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 400 వరకూ బరుల్లో కోడిపందేలు నిర్వహిస్తుంటారు. రెండు జిల్లాల్లో కోడిపందేల మాటున సుమారు రూ.300 కోట్లు, జూదక్రీడల మాటున సుమారు మరో రూ.150 కోట్లు చేతులు మారుతున్నాయంటే అతిశయోక్తి కాదు. అలాగే హోటళ్ల బుకింగ్, తినుబండారాలు కలుపుకుని రూ.కోటీ 50 లక్షల వరకూ చేతులు మారుతున్నట్లు అంచనా. అయితే సంక్రాంతి పండుగకు మరో నెల రోజులు సమయం ఉన్నప్పటికీ ఏర్పాట్లు ముమ్మరంగా జరిగిపోతున్నాయి. కోడిపందేలు తిలకించేందుకు సినీ, రాజకీయ ప్రముఖులు తరలివస్తుంటారు. అందుకు తగ్గట్టుగానే పుంజుల పెంపకంలో పందెంరాయుళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎక్కువ మంది ఇల్లు, తమ మకాంల వద్ద పుంజులు పెంచితే దేశ విదేశాల నుంచి వచ్చేవారు ప్రత్యేక ట్రైనర్లతో కోళ్లకు శిక్షణ ఇస్తుంటారు. కోళ్ల పెంపకం వద్ద పనిచేసే వారికి నెలకు రూ.15 నుంచి రూ. 25 వేల వరకూ జీతాలు అందించి మరీ పుంజులు పెంపకం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతేకాకుండా ప్రత్యేక మేత, మందులతో ఒక్కో పుంజుకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకూ ఖర్చవుతుందంటున్నారు. వీటి జాతి, రంగు, రకం బట్టి రూ.50 వేల నుంచి లక్షల్లో పలుకుతాయని చెబుతున్నారు. మామూలుగా ఇళ్ల వద్ద పెంచే పుంజులు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకూ అమ్ముతుంటారు. పండుగకు నాలుగు వేల పుంజుల అమ్మకాలు సాగుతాయని నిర్వాహకులు తెలిపారు. వీటి ద్వారా రూ.10 కోట్లు వ్యాపారం సాగుతుందని అంచనా. జిల్లాలోని భీమవరం, పాలకోడేరు, ఉండి, ఆకివీడు, పాలకొల్లు, కాళ్ల మండలాల్లో 200కు పైగా నాటు కోళ్ల పెంపకం కేంద్రాలు నడుస్తున్నాయి. అయితే ప్రస్తుతం పందేలకు పుంజులు రెడీ చేస్తున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా వాటికి కావాల్సిన శిక్షణ, మేత మందులు అందించి పందేలకు సమాయత్తం చేయడంలో పందేల నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ఇదిలా ఉంటే బరుల ఏర్పాటుపై బేరసారాలు జరుగుతున్నాయి. గ్రామాల్లో పోటాపోటీగా బరులు ఏర్పాటు చేసేందుకు కూటమి నేతలు సిద్ధమవుతున్నారు.

అడ్వాన్స్ బుకింగ్స్‌తో హోటళ్లు బిజీబిజీ

ఉమ్మడి జిల్లాకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి జనం భారీగా తరలివస్తారు. దీంతో పండుగ నాలుగు రోజులు జిల్లాలో ఉండడానికి హోటళ్లను ముందుగానే బుక్ చేసుకుంటారు. పండుగ సమయంలో హోటళ్లు దొరకడం కష్టం. హోటల్ రూమ్ కోసం ఎంత రేటు పెట్టినా రూమ్ దొరకని పరిస్థితి ఉంటుంది. సాధారణ లాడ్జీల నుంచి పెద్ద హోటళ్ల వరకూ ఫుల్ డిమాండ్ ఉంటుంది. కొందరు విడిది ఇళ్లు, కళ్యాణ మండపాల్లోని రూమ్‌లు సైతం సంక్రాంతి సమయంలో అద్దెకిస్తుంటారు. పశ్చిమగోదావరి జిల్లాలో పెద్ద హోటళ్లు 20, సాధారణ హోటళ్లు 25, లాడ్జీలు 20 వరకూ ఉన్నాయి. అలాగే రూమ్‌లతో కలిసి ఉన్న కళ్యాణ మండపాలు దాదాపు 50 నుంచి 60 వరకూ ఉన్నాయి. ఏలూరు జిల్లాలో కూడా ఇదే స్థాయిలో ఉన్నాయి. జనవరి 10 నుంచి 20వ తేదీ వరకూ 10 రోజుల్లో హోటళ్లు, లాడ్జీలు, కళ్యాణ మండపాలపై ఏటా రూ.కోటీ 50 లక్షల వరకూ వ్యాపారం జరుగుతోంది. సాధారణ రోజుల్లో నెలకు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ వ్యాపారం జరుగుతుంది.

సంక్రాంతికి హోటళ్ల రూమ్ ప్యాకేజీ రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకూ ఉంటుంది. ఈ ఏడాది కూడా నవంబరు నుంచే జిల్లాలోని హోటళ్ల రూమ్‌ల బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే జిల్లాలోని ప్రముఖ హోటళ్లలో రూమ్‌లన్నీ జనవరి 10 నుంచి 20వ తేదీ వరకూ బుకింగ్ అయిపోయాయి. పెద్ద హోటళ్ల రూమ్‌లు మొత్తం అడ్వాన్స్ బుకింగ్ కాగా లాడ్జీల్లో రూములు 90 శాతం బుకింగ్ పూర్తయ్యాయి. భీమవరం తర్వాత తణుకు, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం పట్టణాల్లో సంక్రాంతికి ముందే బుక్ చేసుకున్నారు. ముఖ్యంగా హైదారాబాద్ నుంచి వచ్చే వారు అధికంగా రూమ్‌లు బుక్ చేసుకున్నట్లు హోటళ్ల మేనేజర్లు చెబుతున్నారు.

టెట్ పరీక్షలు ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా 762 మంది హాజరు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో టెట్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 762 మంది పరీక్షకు హాజరు కాగా 67 మంది గైర్హాజరయ్యారు. 91.92 శాతం హాజరు నమోదైంది. జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరిగింది. ఉదయం సెషన్‌లో 540 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 494 మంది హాజరయ్యారు. 46 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 289 మంది హాజరుకావాల్సి ఉండగా 268 మంది హాజరయ్యారు. 21 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్లలో 829 మంది హాజరు కావాల్సి ఉండగా 762 మంది హాజరయ్యారు. 67 మంది గైర్హాజరయ్యారు. స్పెషల్ స్క్వాడ్ టీమ్, జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి ఇ.నారాయణ పరీక్షా కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఏవిధమైన మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన జెసి

జిల్లాలో టెట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. భీమవరం విష్ణు కళాశాలలో బుధవారం టెట్ పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం కేంద్రాల్లోని 8 సెంటర్లలో 12,985 మంది అభ్యర్థులు టెట్ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. వీటికి సంబంధించి అన్ని ఏర్పాట్లూ చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 144 సెక్షన్ కూడా విధించడం జరిగిందని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, టాయిలెట్లు, మెడికల్ క్యాంపులు, చుట్టుపక్కల శానిటేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గరగపర్రు వంతెన నిర్మించాలి

శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు బెంబేలు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రు వంతెన నిర్మాణం చేపట్టి 92 ఏళ్లు గడుస్తోందని, ప్రస్తుతం వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు వంతెనపై ప్రయాణించేందుకు బెంబేలెత్తిపోతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. గరగపర్రు వంతెనను ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా తక్షణం నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. గరగపర్రు వంతెన వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ గరగపర్రు వంతెన నిర్మాణంపై అటు పాలకులకు ఇటు అధికారులకు కనీసం శ్రద్ధ లేదన్నారు. వంతెన శిథిలావస్థకు చేరిందని, ఏ సమయంలో కూలుతుందో ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వంతెనకు ఇరువైపులా రైయిలింగ్ లేకపోవడంతో మరింత ప్రమాదంగా మారిందన్నారు. భీమవరం - తాడేపల్లిగూడెం ప్రధాన రహదారిలో ఈ వంతెన ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనేక సార్లు భారీ వాహనాలు ఈ వంతెనపై ఇరుక్కుపోయి ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయన్నారు. అయితే ప్రత్యామ్నాయంగా వంతెనను ఏర్పాటు చేయకుండా ఉన్న వంతెన మూసివేస్తున్నట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రయాణికుల ప్రయాణానికి ఆటంకం లేకుండా వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకోడేరు, ఉండి సిపిఎం మండల కార్యదర్శులు అశ్రియ్య, ధనికొండ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

బాలోత్సవాలకు తరలిరండి

జిల్లా ఎస్‌పికి ఆహ్వాన పత్రిక అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం బాలోత్సవం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో ఎస్ఆర్‌కెఆర్‌లో 3వ పిల్లల సంబరాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, అందరూ తరలిరావాలని సంఘం ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన పట్టాభిరామయ్య తెలిపారు. పిల్లల సంబరాలకు వచ్చే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు ఉంటాయన్నారు. మొదటి రోజు ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్‌సి బి.గోపీమూర్తి, డిఇఒ, రెండో రోజు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, డిస్ట్రిక్ట్ ట్రెజరరీ ఆఫీసర్, సమగ్రశిక్ష అభియాన్ ఎపిసి పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా బుధవారం బాలోత్సవ సంఘం సభ్యులు జి.రఫాయేలు, బి.చైతన్య ప్రసాద్ జిల్లా ఎస్‌పికి ఆహ్వాన పత్రిక ఇచ్చి ఆహ్వానించినట్లు తెలిపారు. బాలోత్సవాలకు చుట్టుపక్కల 6 మండలాలు, భీమవరం టౌన్ నుంచి ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు వివిధ ప్రదర్శనల్లో, పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, మెమెంటోలు, మెడల్స్ అందజేస్తామని తెలిపారు. ఈ బాలోత్సవాలు పిల్లల్లో వినోదం, విజ్ఞానం, సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచన, దేశభక్తి, సేవా దృక్పథం పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు.

జిల్లా ఎస్‌పిని ఆహ్వానిస్తున్న నేతలు

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నేతలు, అంగన్‌వాడీలు

12న కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల మహాధర్నా

ప్రజాశక్తి - తణుకు

అంగన్‌వాడీ వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. బుధవారం అంగన్‌వాడీ చలో కలెక్టర్‌ను విజయవంతం చేయాలని కోరుతూ డిమాండ్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. గతంలో 42 రోజులు సమ్మె చేసినప్పుడు ఇచ్చిన హామీల అమలుకు ఆదేశాలివ్వాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అంగన్‌వాడీలను మోసం చేసిందన్నారు. ఫ్రీ స్కూల్స్ బలోపేతం చేయాలన్నారు. అన్ని యాప్‌లూ ఒకే యాప్‌గా మార్చాలని అన్నారు. అంగన్‌వాడీల సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ నెల 12న జరిగే ధర్నాకు అంగన్‌వాడీలు పెద్దఎత్తున తరలి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి ఎం.మధుశీల, జి.కనక దుర్గ, ఎం.ధనలక్ష్మి, ఎన్.విజయానంద కుమారి, ఎ.సుబ్బలక్ష్మి, కె.అనిత, ఎస్.రమాదేవి, కె.పద్మ, ఎస్‌కె.షహీదా, సిఐటియు నాయకులు గార రంగారావు పాల్గొన్నారు.

టెట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటీషన్ వేయాలి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీలు

భీమవరంలో ర్యాలీ చేస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - భీమవరం

టెట్ పరీక్షపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టానికి తగు సవరణలు చేయాలని కోరారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయం నుండి ప్రకాశం చౌక్ సెంటర్ వరకూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నేతలు, ఉపాధ్యాయులు బుధవారం రాత్రి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ప్రభుత్వాలు వెంటనే సుప్రీంకోర్టులో టెట్‌పై రివ్యూ పిటీషన్ వేయాలన్నారు. డిఎస్‌సి 1989, 1995 నుండి 2008 డిఎస్‌సి వరకూ 2012 వరకూ ఉపాధ్యాయులు నియమితులై ఉన్నారన్నారు. 2012 తర్వాత వచ్చిన నియామకాల్లో టెట్ రాసిన వారే ఉన్నారని తెలిపారు. 2012కు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులందరికీ టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు జి.రామకృష్ణంరాజు, కె.రామకృష్ణ ప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జి.అబ్రహం, మండల నాయకులు కె.వామనమూర్తి, కె.త్రిమూర్తులు, రాంబాబు, టి.వెంకటేశ్వరరావు, జి.భవానిప్రసాద్, బి.నాగబాబు ఎంఎంఎస్.సిహెచ్.శ్రీనివాస్, ఎన్.ప్రసాద్‌బాబు, కెవి.నారాయణ, కె.సురేష్‌బాబు, ఎం.శివరామరాజు, ప్రసాదరావు, శంకర్‌బాబు, ఆర్.రాజు, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురం : టెట్ పరీక్షపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర, రాష్ట్రం ప్రభుత్వాలు రివ్యూ పిటీషన్లు వేయాలని బుధవారం రాత్రి యుటిఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తక్షణం విద్యాహక్కు చట్టానికి తగు సవరణలు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులందరూ రెండు సంవత్సరాల్లోపు ఉన్న టీచర్లు టెట్ తప్పనిసరిగా పాసవ్వాలని లేకుంటే సర్వీస్ నుంచి తొలగించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం సరికాదన్నారు. దీని వల్ల ఉపాధ్యాయుల భవిష్యత్ ప్రమాదంలో పడే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రివ్యూ పిటీషన్ వేశామని చెప్పిందన్నారు. ప్రభుత్వం తరపున రివ్యూ ఫిటీషన్ దాఖలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఉమాండ్ చేశారు. ఈ ఆందోళనలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు పి.కృష్ణకుమారి, కె.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నరసాపురంలో నిరసన

సమస్యలు పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

ప్రజాశక్తి - మొగల్తూరు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపిడిఒ కె.త్రిశూలపాణికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడారు. ఉపాధి హామీలో 19 సంవత్సరాల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తూ ఉపాధి కులీలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని, తమకు ఇస్తున్న వేతనంతో కుటుంబాలు బతకడం చాలా కష్టంగా మారిందని తెలిపారు. దీనికితోడు రాజకీయ ఒత్తిడులు, వేధింపులు అరికట్టి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. తాము ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు మాన్ డేస్ విధానాన్ని రద్దు చేసి మండల స్థాయి బదిలీ సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్ఎంఎస్ యాప్‌లో కూలీల హాజరు, హెడ్ కౌంటింగ్ అప్‌లోడ్ సర్వర్ లోపాలను సకాలంలో సరిదిద్దాలన్నారు. కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. దీనిపై ఎంపిడిఒ సానుకూలంగా స్పందించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమాల్లో కంప్యూటర్ ఆపరేటర్ జెవివి.శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు గుడాల వెంకటేశ్వరరావు, కౌరు వీర వెంకట సత్యనారాయణ, బర్రి రామ మురళీకృష్ణ, మొగలపు సురేష్, జి.శ్రీనివాస్, పి.నారాయణమూర్తి, కవురు పెద్దిరాజు, తిరుమాని వీర వెంకట సుందర నాగరాజు, గంగ పాల్గొన్నారు.



ఎంపిడిఒ త్రిశూళపాణికి వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

గోదావరి క్రీడా జట్లు ఎంపిక చేయాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

గోదావరి క్రీడా పోటీల్లో పాల్గొనే జట్ల ఎంపిక ప్రారంభించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. కలెక్టరేట్లో బుధవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించే గోదావరి క్రీడా సంబరాల ఏర్పాట్లపై డిఆర్ఒ, ఆర్‌డిఒలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 3,300 మంది అధికారులు, ఉద్యోగులు నమోదు చేసుకున్నారన్నారు. క్రికెట్, క్యారమ్స్, టెన్నిస్ విభాగాల్లో ఆడేందుకు ఎక్కువ మంది ఉద్యోగులు ఆసక్తి చూపారన్నారు. డివిజనల్ స్థాయిలో క్రీడా పోటీలకు క్రీడా మైదానాలను, సంబంధిత సామగ్రిని సిద్ధం చేసుకోవాలని ఆర్‌డిఒలను ఆదేశించారు. ఈ పోటీలు సజావుగా జరిగేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఖాతిబ్ కౌసర్ భానో, అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులతో రాహుల్ కుమార్ రెడ్డి

వికలాంగులు ఉన్నతస్థాయికి ఎదగాలి

వికలాంగులు తమలోని నైపుణ్యాన్ని గుర్తించి సాధన చేసి ఉన్నతస్థాయికి ఎదగాలని జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. భీమవరం డిఎన్ఆర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రీడాపోటీల ముగింపులో జెసి పాల్గొని క్రీడల్లో గెలుపొందిన వికలాంగులకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. వికలాంగులకు బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఇంటింటికి రేషన్ అందించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని సంఘం నాయకులు బి.వెంకటరమణ, జి. సంపదరావు, సిహెచ్ తాతారావు, టి.రాము, నండూరి రమేష్ తదితరులు జెసికి తెలిపారు. సమస్యలు పరిష్కారానికి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం వివిధ వికలాంగ అసోసియేషన్లకు చెందిన నాయకులు ఎం.సందీప్ వర్మ, జె.రాముడు, పి.ఏడుకొండలు, ఉమా మహేష్, టి.రాము, ఎ.నటరాజ్, ఎన్ఎస్ఎస్ రాములు, పి.లక్ష్మణరావు, కె.సురేష్, సాయి దుర్గ, డి.సురేష్, సిహెచ్ నాగ శ్రీనివాస్, కె.వీర్రాజు, కె.శ్రీనివాసుల జెసి సత్కరించి మెమెంటోలు అందజేశారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు బి.రామకుమార్, సూపరింటెండెంట్ కె.కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెంచలయ్య హత్యకు కారకులను అరెస్టు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నెల్లూరులో ప్రజా గాయకుడు, సిపిఎం యువ నాయకుడు పెంచలయ్యను హత్య చేసిన గంజాయి ముఠాను అరెస్టు చేసి శిక్షించాలని, పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో తోకతిప్ప గ్రామంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో పెంచలయ్యను గంజాయి ముఠా హత్య చేయడం దారుణమన్నారు. చిన్న వయసులోనే యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడి వారు బతుకులను పాడు చేసుకుంటున్నారని అనేకసార్లు పెంచలయ్య ప్రభుత్వానికి విన్నవించుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. పెంచలయ్య కథలు, నాటకాలు పాటల ద్వారా గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రజలను చైతన్యం చేస్తుంటే ఓర్చుకోలేని కామాక్షి గంజాయి ముఠా ఆయనను దారుణంగా హత్య చేయడం దారుణమని, దీన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. తక్షణం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కామాక్షి గంజాయి ముఠాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, గంజాయి, డ్రగ్స్ అరికట్టాలని, పెంచలయ్య కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖా కార్యదర్శి బుడ్డు లక్ష్మీపతి, పొన్నమండ నాగేశ్వరరావు తిరుమాని సూర్యనారాయణ, తోటే శుభకరరావు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పెనుగొండ

విశాఖపట్నంలో ఈనెల 31వ తేదీ నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు జరిగే అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు పెనుగొండ మండల కమిటీ కోరింది. స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో కార్మికుల సమావేశం జరిగింది. అనంతరం మహాసభల సందర్భంగా జనవరి 4వ తేదీన జరిగే ప్రదర్శనకు, బహిరంగ సభకు పెద్ద ఎత్తున కార్మికులు తరలి రావాలని సిఐటియు మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. అనంతరం చలో విశాఖపట్నం సిఐటియు గోడ పత్రికను కార్మికులు ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు మాట్లాడారు. అంగన్వాడీలు పి.శ్రీదేవి, వియమ్.భవాని, ఆశాలు కంకిపాటి లక్ష్మీకుమారి, కెవిఎన్.లక్ష్మి, ఐకెపి వివఏలు వి.లక్ష్మి, బి.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

పెనుమంట్ర : సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలని పలువురు నేతలు కోరారు. బుధవారం పెనుమంట్రలోని బ్రాహ్మణ చెరువు సివిల్ సప్లై గొడౌన్ వద్ద ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ జరిగే మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. మహాసభలలో కార్మిక చట్టాలపై చర్చ జరుగుతుందని, అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్ మీద చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. 4వ తేదీన జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు ప్రశాంతి, టి.ఆంజనేయులు, గుడిపూడి శ్రీరామచంద్రమూర్తి, మల్లెల శ్రీను ఉన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్ షెడ్ యూనియన్ వద్ద ఈనెల 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు జరుగుతున్న మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి, ఉపాధ్యక్షులు కర్రి సాయి రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశంలో కార్మిక వర్గం 1886 నుండి అనేక పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసి ఎనిమిది గంటల పని దినం, కార్మిక చట్టాలు, హక్కులు సాధించుకుంటున్నారు. 44 కార్మిక చట్టాలను 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమూలంగా మార్పు చేసి కార్మికులను కట్టు బానిసల చేయాలని చూస్తుందని, వ్యతిరేకించాలని చెప్పారు. బిజెపి విధానాలను తిప్పికొట్టేందుకు ఈ మహాసభలలో చర్చిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కర్రి శ్రీనివాస్ రెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి, అడప ఆంజనేయులు, బుద్దాల నాని, ఎస్‌విఎస్.రెడ్డి, గాది వెంకట్రావు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవలు అభినందనీయం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం


సామగ్రి పంపిణీ చేస్తున్న ఆర్‌డిఒ

స్వచ్ఛంద సేవలు అభినందనీయమని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. పట్టణంలోని 25వ వార్డు వివర్స్ కాలనీలో మొంథా తుపాను కారణంగా నష్టం జరిగిన 191 మంది కుటుంబాలకు సినార్డ్ సంస్థ ఆధ్వర్యాన సహాయక సామగ్రి పంపిణీ చేశారు. ఆర్‌డిఒ దాసిరాజు పాల్గొని బాధితులకు సామగ్రి పంపిణీ చేసి మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో నష్టపోయిన ప్రజలను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన సినార్డ్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో మానవతా సేవలో ముందంజలో ఉండేది సినార్డ్ అన్నారు. కౌన్సిలర్ యర్రా ఉమా, యర్రా శ్రీను, ఘంటా కృష్ణ, కామన బుజ్జి, బి.శంకర్, ఈశ్వర్, రామకోటి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

ఎంపిడిఒ ఎ.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఇరగవరం

పరిసరాల పరిశుభ్రతకు అందరూ సహకరించాలని ఎంపిడిఒ ఎ.శ్రీనివాసరావు అన్నారు. ఇరగవరం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా వచ్చిన మూడు ట్రాక్టర్లు, ట్రక్కులను కూటమి నాయకుల ఆధ్వర్యాన ప్రారంభించారు. అనంతరం పేకేరు, అర్జునుడు పాలెం, కె.ఇల్లింద్రపర్రు గ్రామపంచాయతీలకు వీటిని పంపిణీ చేశారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చెత్త సేకరణ విషయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

శ్రీనివాస్‌కు పరామర్శ

ప్రజాశక్తి - వీరవాసరం

టిడిపి సీనియర్ నాయకులు మన్నె శ్రీనివాస్‌ను మాజీ ఎంఎల్ఎ గ్రంథి శ్రీనివాస్, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి బుధవారం అండలూరులోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. మన్నె శ్రీనివాస్ తండ్రి మన్నె కొండయ్య వయోభారంతో ఇటీవలే మృతి చెందారు. వీరవాసరం కొండయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇంటి పెద్ద మృతి కుటుంబంలో తీర్చలేదని శ్రీనివాస్, సీతారామలక్ష్మి అన్నారు. యాధృశ్చికంగా సీతారామలక్ష్మి గ్రంధిలు ఒకే సారి పరామర్శకు రావడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. గ్రంధి శ్రీనివాస్ వైసిపికి రాజీనామా చేయడం ఆయన టిడిపిలోకి చేరతారంటూ ఊహాగానాలు గత కొద్ది నెలలుగా చర్చనడుస్తుంది. ఈ నేపథ్యంలో టిడిపికి చెందిన మన్నె శ్రీనివాస్‌ను పరామర్శించడానికి తోట సీతారామలక్ష్మి వచ్చిన సమయంలోనే గ్రంధి శ్రీనివాస్ కూడా రావడంతో స్థానికులు వారి రాకను ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. గ్రంధి టిడిపిలోకి రావడం ఖాయం అన్న వ్యాఖ్యానాలు స్థానిక పెద్దల నుండి వినిపిస్తున్నాయి. పరామర్శించిన వారిలో మాజీ ఎంపిపి ఛైర్మన్ కోటి పళ్లిబాబు, గొలగాని సత్యనారాయణ, దాసరి మాణిక్యం ఉన్నారు.

వీరవాసరంలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ అధ్యక్షులు జల్లా శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. 69వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో భాగంగా అండర్-17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలకు 13 జిల్లాల నుండి బాలబాలికల జట్లు నుండి 416 మంది క్రీడాకారులు, 52 మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొంటారని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు పిఎస్‌ఎస్.మల్లేశ్వరావు, బాజింకి శ్రీనివాస్‌లు తెలిపారు. వీరంతకి భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు సునీత, మల్లేశ్వరావు తెలిపారు.

కోటి సంతకాల సేకరణ పూర్తి సందర్భంగా ర్యాలీ

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ పూర్తయిన సందర్భంగా పెదఅమిరంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు ఆధ్వర్యాన నాలుగు మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. కోటి సంతకాల పత్రాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరు ప్రసాద్ రాజుకు అందజేశారు. నంద్యాల సీతారామయ్యలక్ష్మి పాటు పలువురు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం

తణుకు : తణుకు పట్టణ పరిధిలోని సజ్జాపురం 28వ వార్డులో బుధవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి టిడిపి నాయకులు అండగా నిలిచారు. ఆకుల లక్ష్మయ్య చెందిన ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు కూటమి నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.15 వేలు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసరాలను అందజేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యాన మరో రూ. 10 వేలు ఆర్థిక సాయం చేయగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు

నరసాపురం : నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య వ్యవహారం రాజధానికి చేరింది. బుధవారం మున్సిపల్ ఛైర్మపర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, కౌన్సిలర్ బర్రె జయరాజులు అమరావతి వెళ్లి మున్సిపల్ డైరెక్టర్ సంపత్ కుమార్‌ను కలిశారు. కమిషనర్ ఎం. అంజయ్య పరిస్థితుపై ఫిర్యాదు చేశారు. మున్సిపల్ యాక్ట్ 1965 నిబంధనలకు వ్యతిరేకంగా కమిషనర్ పని చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. కౌన్సిల్ ప్రమేయం లేకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ అనవసర పనులకు ఖర్చు చేసారని ఆరోపించారు. ఈ విషయమై విచారించి, ప్రభుత్వానికి నివేదిక చేసి రాబోవు పుష్కరాల అభివృద్ధి పనులకు దోహదపడే అధికారిని కమిషనర్‌గా నియమించాలని కోరారు.

'శివారు ఆయకట్టుకు సైతం సాగు నీరందించాలన్నదే లక్ష్యం'

పెనుమంట్ర: దాల్వా పంటకు శివారు వాయికట్టుకు సైతం సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని నెగ్గిపూడి ఇరిగేషన్ లాకుల వద్ద ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘం నాయకులు దాల్వా పంటకు సాగునీటిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులు, నీటి సంఘం నాయకులు, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో నీటి ఎద్దడికి నివారణ చర్యలు చేపట్టాలని సత్యనారాయణ కోరారు. నరసాపురం డిఇఇ వెంకటనారాయణ, వైస్ డిసి ఛైర్మన్ జి.సూర్యనారాయణ రాజు, ఆలమూరు నీటిసంఘం అధ్యక్షులు ఇందుకూరి వెంకట నరసింహరాజు, నీటి సంఘం అధ్యక్షులు ఎస్.ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యం అభినందనీయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గణపవరం

గ్రామీణ ప్రాంత ప్రజలకు కేన్సర్ ఉచిత వైద్యం అందిస్తున్న గణపవరం లయన్స్ క్లబ్ కృషి హర్షించదగ్గ విషయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం స్థానిక డిగ్రీ కాలేజీ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఫ్రెష్యూటలిస్ హాస్పిటల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ ప్రజలకు కేన్సర్ వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పద్ధతులు, ముందస్తు పరీక్షల ఆవశ్యకతను వివరించారు. వ్యాధిపై వైద్యనిపుణులు ప్రజలకు అవగాహన కల్పించడాన్ని ఆయన ప్రశంసించారు. ఇలాంటి ఉచిత వైద్యశిబిరాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఈశిబిరంలో బసవతారకం ఇండో అమెరికన్ వైద్యులు రోగులకు వైద్యసేవలందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కిలారిరవిబాబు, వెల్లంకి నరేష్, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, సభ్యులు గంటా అన్నవరం, రావూరి నాగరాజు, ఛైర్మన్ పోసంశెట్టి రామ్మూర్తి, కోశాధికారి కెఎస్ఎన్.మూర్తి, ఎస్.ఎస్.నారాయణ పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - మొగల్తూరు

ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది

మండలకేంద్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో జాతీయ నాయకుల విగ్రహానికి అడ్డుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని పంచాయతీ సిబ్బంది బుధవారం తొలగించారు. ఈనెల 10వ తేదీన ప్రజాశక్తిలో 'జాతీయ నేతల విగ్రహాలకు ప్రాధాన్యతనివ్వాలి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఎంపిడిఒ కె.త్రిశూలపాణి ఆదేశాల మేరకు మొగల్తూరు పంచాయతీ ఇన్‌ఛార్జి, కార్యదర్శి యడ్లపల్లి మహేష్ పర్యవేక్షణలో సిబ్బంది జాతీయ నాయకుల విగ్రహాలకు అడ్డుగా ఉన్న ఫ్లెక్సీని, కీర్తిశేషులు, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మెడకు ఉన్న తాడును తొలగించారు.

పలు వార్డుల్లో ఎంఎల్ఎ నాయకర్ పర్యటన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పర్యటించి పారిశుధ్య పనులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను వేగవంతంగా చేపట్టాలని పారిశుధ్య కార్మికులకు ఆయన సూచించారు. వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని, స్వయంగా సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులు చేపట్టి చెత్తను తొలగించేశారు. ప్రజలు తమ నివాసాలను ఎంత శుభ్రంగా ఉంచుకుంటారో, అదే విధంగా చుట్టుపక్కల పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచాలని, రోడ్లపై చెత్త వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నరసాపురంలో నెలకొన్న డంపింగ్ యార్డు సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం దిశగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, గంటా కృష్ణ, పోలిశెట్టి నళిని, కొప్పాడ కృష్ణవేణి, బొమ్మిడి కృష్ణమూర్తి కుమారి పాల్గొన్నారు.

కొనసాగిన ప్రత్యేక సేవా శిబిరం

ప్రజాశక్తి - పాలకోడేరు

భీమవరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన పెన్నాడ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవ శిబిరం మూడో రోజు బుధవారం కూడా కొనసాగింది. బ్రెస్ట్ అండ్ సర్వైకల్ కేన్సర్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పడాల చారిటబుల్ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ ఆకుల మౌనిక విద్యార్థులకు, గ్రామస్తులకు రుతుస్రావ పరిశుభ్రత, వ్యాక్సినేషన్, పరీక్షలు, పోషకాహారం వంటి అంశాలపై వివరించారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎబిఎస్ఆర్.మనోహర్, బివిఆర్ఐటి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మంగతాయారు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ కె.రాగిణి, డీన్ డాక్టర్ కురెళ్ల భాస్కరరావు, వైస్ ప్రిన్సిపల్ ఎస్.మురళీకృష్ణ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డిసిఎంఎస్ రాష్ట్ర నేతలు

ప్రజాశక్తి - నరసాపురం


మంత్రిని సత్కరిస్తున్న డిసిఎంఎస్ ఛైర్మన్

రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో డిసిఎంఎస్ రాష్ట్ర నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. సహకార మార్కెటింగ్ ప్రభుత్వం నుండి సహకారం అందిస్తున్న సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. డిసిఎంఎస్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున పూర్తిగా సహకరించాలని డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ(చిన్న) కోరారు. అనంతరం మంత్రిని డిసిఎంఎస్ సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. గుంటూరు జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్, రాష్ట్ర అధ్యక్షులు వాణ్ణం హరిబాబు, కృష్ణ జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, ప్రకాశం జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ కాశీ రెడ్డి పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

పాలకోడేరు ఇన్‌ఛార్జి తహశీల్దార్ రఘు

పాలకోడేరు : ఈనెల 21న నిర్వహించబోయే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలకోడేరు ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.రఘు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమంపై మండల స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. 22, 23 తేదీల్లో గడపగడపకూ పోలియో చుక్కల కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ వి.రెడ్డయ్య, సిహెచ్ఒ.సత్యనారాయణ, ఎంఇఒ శివ నాగరాజు పాల్గొన్నారు.

వార్షిక తనిఖీ పూర్తి

వీరవాసరం : రాయకుదురు హైస్కూల్లో భీమవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎస్.రమేష్ రెండు రోజులపాటు నిర్వహించిన వార్షిక తనిఖీ బుధవారంతో ముగిసిందని ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను తనిఖీ చేసి డివైఇఒ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉప విద్యాశాఖాధికారితో పాటు వివిధ హైస్కూళ్లకు చెందిన హెచ్ఎంలతో పాటు వివిధ సబ్జెక్టు సంబంధించిన ప్యానెల్ మెంబర్స్ విచ్చేసి ఉపాధ్యాయుల బోధన విధానాలను పరిశీలించి విద్యార్థుల ప్రగతిపైవృద్ధికి కొన్ని సూచనలు చేశారు. హెచ్ఎంలు జె.శ్రీనివాసరావు, కిషోర్ కుమార్‌తో పాటు విషయ నిపుణులు తన్నీటి నరసింహారావు, ఎస్ఎస్ఎన్.రాజు, హైమావతి, గిరిజా రమాదేవి, గంగామహేష్ పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

పాలకొల్లు రూరల్: పాలకొల్లు నియోజకవర్గంలో మంత్రి రామానాయుడు ఆదేశాలతో పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని సగం చెరువు గ్రామంలో 30 బస్తాలు, గోరింటాడలో 30 బస్తాలు, అడ్డకట్టలో 60 బస్తాలు పశువుల దాణా పంపిణీ జరిగింది. కార్యక్రమంలో సర్పంచి కడలి నాగమణి, సర్పంచి మండేల పావని, ఎంపిటిసి మామిడిశెట్టి లలిత కుమారి పాల్గొన్నారు.

జాబ్‌కార్డులు పూర్తిచేయాలి

ఎంపిడిఒ కె.త్రిశూలపాణి

ప్రజాశక్తి - మొగల్తూరు

పెండింగ్‌లో ఉన్న జాబ్‌కార్డులు పూర్తిచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపిడిఒ కె.త్రిశూలపాణి సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయ భవనంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలో పనితనం ఎక్కువ వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు చేపట్టాలని సూచించారు. జరిగిన పనుల వెంటనే జియో ట్యాగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ జె.శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

జాతీయ రహదారిపై అంధకారం..!

ప్రజాశక్తి - మొగల్తూరు

జాతీయ రహదారిపై వెలగని వీధిలైట్లు

జిల్లాలోని 216 జాతీయ రహదారిపై వీధిలైట్లు సక్రమంగా వెలగడంలేదు. దీంతో రాత్రి సమయంలో అంధకారం నిండుతుంది. యలమంచిలి మండలం చించినాడ నుంచి నరసాపురం పట్టణం, సీతారామపురం, మొగల్తూరు, కాళీపట్టణం, నాగిడిపాలెం నుంచి భీమవరం గ్రామీణ మండలం లోసరి వరకూ 42 కిలో మీటర్ల మేర 216 జాతీయ రహదారి ఉంది. దీనికి జాతీయ రహదారి పొడవునా ఉన్న గ్రామాలు, నరసాపురం పట్టణ పరిధిలో గతంలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ సక్రమంగా లేదు. గాలి, వర్షం తదితర కారణాలతో అవి తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఆ రహదారి నిర్వహణ కాంట్రాక్టు సంస్థ వీధిలైట్లకు సకాలంలో మరమ్మతులు చేయడం లేదు. వీధిలైట్లు సక్రమంగా వెలగకపోవడంతో రాత్రి సమయంలో వివిధ పనుల నిమిత్తం ప్రజలు బయట ప్రాంతాల నుంచి ఇక్కడకు, ఇక్కడ నుంచి బయటి ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడిచి, సైకిళ్లపై వెళ్లే వారు చీకటిలో ప్రయాణించేందుకు భయపడి వెలుగుల కోసం ఆ రహదారిపై వాహనాలు వచ్చిన సమయంలో కొనసాగిస్తున్నారు. ముఖ్య మాడల్ల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి వీధిలైట్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను ప్రజాశక్తి జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ మలికిపట్నం ప్రాజెక్టు ఎఇ వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లగా వీధిలైట్లకు వెంటనే మరమ్మతులు చేయించేందుకు చర్యలు చేపడతామన్నారు.

విద్య హబ్‌గా భీమవరం

నారాయణ ఇ టెక్నో స్కూల్ ప్రారంభంలో ఎంఎల్ఎ అంజిబాబు, మండలి ఛైర్మన్ మోషేన్ రాజు


ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ, మోషేన్‌రాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్య హబ్‌గా భీమవరం విరాజిల్లుతుందని, భీమవరంలోనే విద్యా కేంద్రమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. బుధవారం భీమవరం గునుపూడిలో నారాయణ ఇ టెక్నో ప్రోగ్రామ్ స్కూల్‌ను ఆయన, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రాయితీ కూడా ఇవ్వాలని, మధ్యతరగతి విద్యార్థులకు 30 శాతం రాయితీ ఇవ్వాలని అన్నారు. మండలి ఛైర్మన్ మోషేన్ రాజు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. నారాయణ విద్యాసంస్థలు భీమవరంలోనే మరొక బ్రాంచి ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఫీజుల్లో కొంత రాయితీ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. విద్యాసంస్థల డిజిఎం పి.రామిరెడ్డి మాట్లాడుతూ 23 రాష్ట్రాల్లో నారాయణ విద్యాసంస్థల బ్రాంచిలున్నాయని, సుమారు 8 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. భీమవరంలో 12 ఏళ్ల క్రితం నారాయణ విద్యాసంస్థను ప్రారంభించామని, ఈ విద్యా సంవత్సరం జనవరి నుంచి గునుపూడిలో మరొక బ్రాంచిని ప్రారంభించుకుంటున్నామని, గునుపూడి బ్రాంచిలో అడ్మిషన్లు ప్రారంభమవుతున్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, విద్యాసంస్థల రీజనల్ ఇన్‌ఛార్జి ఎస్.కృష్ణ కిశోర్, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

'భూసార పరీక్షలపై అవగాహనుండాలి'

ఆచంటలో..

ప్రజాశక్తి - ఆచంట

విద్యార్థి దశనుంచే మట్టి ఆవశ్యకత ఉపయోగాలను విద్యార్థులు తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తాడేపల్లిగూడెం భూసార పరీక్షల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు జి.లక్ష్మీదేవి అన్నారు. ఆచంట వేమవరం జెడిపి హెచ్ఎస్ స్కూల్లో 9వ తరగతి విద్యార్థులకు స్కూల్ సాయిల్ హెల్త్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భూసార పరీక్ష కేంద్రం తాడేపల్లిగూడెం సహాయ వ్యవసాయ సంచాలకులు జి.లక్ష్మీదేవి, వ్యవసాయాధికారి పి.వెంకటరమణ, జిల్లావనరుల కేంద్రం భీమవరం వ్యవసాయాధికారి పి.గీతా దేవి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మట్టి ఆవశ్యకత ఉపయోగాలను తెలుసుకోవాలని విద్యార్థులకు వివరించారు. మనుషులకు ఏవిధంగానైతే ఆరోగ్యం బాలేనప్పుడు వివిధ పరీక్షలు చేయించుకొని వాటిని ఆధారంగా మందులు ఎలా వేసుకుంటున్నారు అదే విధంగా నేల ఆరోగ్య స్థితిని కూడా ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని వివరించారు. భూసార పరీక్షలు చేయించుకుని నేలలోని పోషకాల లభ్యతను గుర్తించి రైతులు ఎరువులను వినియోగించుకోవాలని ఎడిఎ జి.లక్ష్మీదేవి అన్నారు. వ్యవసాయాధికారి పి.గీతాదేవి, బి.నాగరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మట్టి ప్రాముఖ్యత విద్యార్థులందరూ తెలుసుకోవాలన్నారు. జెడిపి హెచ్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ.సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

నరసాపురం: భూమిలో పోషకాలు పెంచే దిశగా వ్యవసాయశాఖ అధికారులు కృషి చేయాలని ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ధాత్రి మాత బచావో అభియాన్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌డిఒ దాసిరాజు మాట్లాడుతూ అధిక మోతాదులో ఎరువులు వినియోగించడం వల్ల భూమిలో సూక్ష్మ పోషకాలు తగ్గిపోతున్నాయన్నారు. దీన్ని అరికట్టేందుకు రైతుల చేత సేంద్రీయ సాగుపై అవగాహన కల్పించాలన్నారు. దీనిపై డివిజన్ స్థాయిలో ఓ కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఛైర్మన్‌గా ఆర్‌డిఒ, కన్వీనర్‌గా ఎడిఏలు ప్రసాద్ మురళీకృష్ణ, డీలర్ అసోసియేషన్, సొసైటీ సంఘం నుంచి సభ్యులుగా ఉంటారన్నారు. ఎఒ జ్యోతిలా, సిబ్బంది పాల్గొన్నారు.

గోకరాజు వినోద్ రంగరాజుకు పితృవియోగం

ప్రముఖుల సంతాపం


నివాళులర్పిస్తున్న నరసింహరాజు


లక్ష్మీనరసింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెం గ్రామ మాజీ ఉపసర్పంచి గోకరాజు వినోద్ రంగరాజుకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి గోకరాజు లక్ష్మీనరసింహరాజు(84) మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. గోకరాజు కుటుంబ సభ్యులతో పాటు పలువురు నాయకులు, శ్రేయోభిలాషులు, అనేకమంది గ్రామస్తులు లక్ష్మీ నరసింహరాజుకి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహరాజుతో ఉన్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను పలువురు మననం చేసుకున్నారు. ఆయనకు భార్య జమిన దేవి, ఒక కుమారుడు వినోద్ రంగరాజు, ఒక కుమార్తె శాంతి ఉన్నారు. ఆయన కుమారుడు వినోద్ రంగరాజు జువ్వలపాలెం గ్రామ ఉపసర్పంచిగా సేవలు అందించారు. నరసింహరాజు మృతిచెందిన విషయం తెలుసుకున్న గోకరాజు కుటుంబసభ్యులు, గ్రా మస్తులు, పలువురు ప్రముఖులు వచ్చి నరసింహరాజు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, డిఎన్ఆర్ కాలేజీ ప్రెసిడెంట్ గోకరాజు నరసింహరాజు, శివబాబు, టిటిడి మాజీ గోకరాజు రామరాజు, యువరాజు, పెద్ద బాబు, కృష్ణంరాజు, లక్ష్మిపతి రాజు, వివిధపార్టీల నాయకులు పాల్గొని ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు. బుధవారం జువ్వలపాలెం గ్రామంలో గోకరాజు లక్ష్మీనరసింహరాజు అంత్యక్రియలు నిర్వహించారు.

పలుచోట్ల అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - గణపవరం

వ్యక్తికి ఉన్న హక్కులను ప్రతిఒక్కరూ గౌరవించాలని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా బుధవారం కాలేజీలో ఫిరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి 1948 డిసెంబరు 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఆనాటి నుండి ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల దినోత్సవం జరుపుతున్నట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, లెక్చరర్లు కెవి.గాయత్రి కుమార్, సిహెచ్.రాజబాబు, కె.గిరిబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు ఎస్ఎస్ఎం డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ, డిపార్ట్మెంట్ ఆఫ్ ఆర్ట్స్ మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యాన డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ, పాలకొల్లు ప్రతినిధి ఎంబిఎస్.ప్రసాద్, బార్ అసోసియేషన్ కిషోర్ కెబి.శ్రీనాథ్, అడ్వకేట్, రాజా శ్యామల, అడ్వకేట్ పాల్గొన్నారు.

తణుకు : రాజ్యాంగం అందరికీ హక్కులు కల్పించిందని వాటిని ఎదుటివారికి ఇబ్బందులు లేకుండా వినియోగించుకోవాలని తణుకు ప్యానెల్ న్యాయవాదులు అన్నారు. బుధవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా చైర్మన్, నల్లాల న్యాయవాదులు మాట్లాడారు. న్యాయవాదులు కోర్టు అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు తణుకు సబ్‌జైల్‌లో సమావేశం జరిగింది. ప్యానెల్ న్యాయవాదులు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, పొంగని శ్రావణసమీర, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నరసాపురం : నరసాపురం పంచాయతీ కార్యాలయంలో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.సూర్య ప్రకాష్, న్యాయవాది పూలెళ్ల శ్రీనివాస్, వర్ అదనపు జిల్లా జడ్జి జి.ఎ.శాంతి, ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ విందా నిర్మల రావు, సెక్రెటరీ కేశవరావు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆదివికోలను గ్రామం, నిడమర్రు మండలం, ఏలూరు జిల్లా నందు గల శ్రీ కేశవ స్వామి దేవాలయములో షెడ్ వేయుటకు రూ.3.25 లక్షలకు టెండరు పిలువబడుచున్నది. ఇతర వివరములకు వెబ్‌సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

సం/- కార్యనిర్వాహణాధికారి

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయి : ఎస్‌పి

భీమవరం టౌన్ : క్రీడలు సిబ్బందిలో ఒత్తిడిని తగ్గించి మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానిక డిఎన్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో ఫిట్ ఇండియా పోలీస్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల ప్రతినిధులతో ఏర్పడిన జట్లు పాల్గొని పరస్పర క్రీడాస్ఫూర్తితో పోటీపడి, అభిమానులను ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చాయి. ఫైనల్ మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరితంగా సాగి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి ఆధ్వర్యంలోని ఎస్‌పి ఎలెవన్ టీమ్ విజేతగా నిలిచింది. జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, నరసాపురం డిఎస్‌పి జి.వేద, జిల్లా స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ కెవిఎస్ఎస్.సత్యనారాయణ, ఆర్మ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
E.P 982 /2024 in O.S.187/2023

Between:
Baswa Krishna Prasad .. DHR
And:
Yuga Sainath Meena Ambica .. JDR

NOTICE

To,
Yuga Sainath Meena Ambica, W/o. Ramalinga Guruswamy Yuga Sainath, Aged 64 years, R/o. D.No.5-4-24/C, Meenakshi Devi Street, Near Meena Biscuit Company, Mentevarri Street, Bheemavaram, West Godavari District .. JDR

Sri Baswa Krishna Prasad filed the above EP 982/2024 against you and it was posted to 29-12-2025 for your appearance. Therefore you are here by directed by the HON'BLE PRINCIPAL DISTRICT JUDGE COURT AT VISAKHAPATNAM to appear before the said COURT or through your advocate on 29-12-2025 at 10.30AM failing which matter will be heard in your absence.

TALLURI RAVI KUMAR, ADVOCATE,
30-7-17, Ranga Street,
Visakhapatnam, Mobile: 9848722288

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
E.P 981 /2024 in O.S.189/2023

Between:
Baswa Krishna Prasad & another .. DHR
And:
Ramalinga Guru Swamy Yuga Sainath .. JDR

NOTICE

To,
Ramalinga Guru Swamy Yuga Sainath. S/O Ramalinga Guru Swamy Modaliar aged 68 years, R/o. D.No.5-4-24/C, Meenakshi Devi Street, Near Meena Biscuit Company, Mentevaari Street, Bheemavaram, West Godavari District .. JDR

Sri Baswa Krishna Prasad & another filed the above EP 981/2024 against you and it was posted to 29-12-2025 for your appearance. Therefore you are here by directed by the HON'BLE PRINCIPAL DISTRICT JUDGE COURT AT VISAKHAPATNAM to appear before the said COURT or through your advocate on 29-12-2025 at 10.30AM failing which matter will be heard in your absence.

TALLURI RAVI KUMAR, ADVOCATE,
30-7-17, Ranga Street,
Visakhapatnam, Mobile: 9848722288

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
E.P 980 /2024 in O.S.189/2023

Between:
Baswa Kalpana .. DHR
And:
Yuga Sainath Guru Narayana Swamy .. JDR

NOTICE

To,
Yuga Sainath Guru Narayana Swamy. S/O Ramalinga Guru Swamy, aged 69 years, R/o. D.No. 5-4-24/C, Meenakshi Devi Street, Near Meena Biscuit Company, Mentevaari Street, Bheemavaram, West Godavari District .. JDR

Sri Baswa Krishna Prasad filed the above EP 980/2024 against you and it was posted to 29-12-2025 for your appearance. Therefore you are here by directed by the HON'BLE PRINCIPAL DISTRICT JUDGE COURT AT VISAKHAPATNAM to appear before the said COURT or through your advocate on 29-12-2025 at 10.30AM failing which matter will be heard in your absence.

TALLURI RAVI KUMAR, ADVOCATE,
30-7-17, Ranga Street,
Visakhapatnam, Mobile: 9848722288

IN THE COURT OF Ist ADDITIONAL JUNIOR CIVIL JUDGE, ELURU
O.S.No.319/2019

Between:
Union Bank of India rep. by its Senior Manager, Bazar Branch, Eluru ...Plaintiff
Vs
1.Sri Chenna Malleswara Rao (Died) and Others ...Defendants

నోటీసు

పై నంబరు దావాను వాది బ్యాంకు మీతో ఒకటవ వారి వద్ద నుండి రావలసిన బాకీని రాబట్టుకొనుటకై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో ఒకటవ ప్రతివాది చనిపోయినందున వారి యొక్క వారసులైనటువంటి మీలో 2 to 4 వారలను పై దావాలో 2 to 4 ప్రతివాదులుగా చేర్చి, సదరు దావాలో ఎన్ని పర్యాయములు మీకు కోర్టు ద్వారా సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. దావాపై కోర్టు వారు మీకు పేపరు పబ్లికేషన్ ద్వారా సమన్లు జారీ చేయమని ఆర్డరు వేసియున్నారు.

కావున మీలో 2 to 4 ప్రతివాదులైన 2.శ్రీమతి చెన్నా భవాని లక్ష్మి, W/o.మల్లేశ్వరరావు 3.చెన్నా ప్రసాదు, S/o.మల్లేశ్వరరావు, D.No.7C-6-12, తూర్పు వీధి, ఏలూరు మరియు 4.శ్రీమతి గున్నం మల్లిక, W/o.కిషోర్ కుమార్, బెల్లంకొండవారి, చాటపర్రు రోడ్, ఏలూరు వారలు ది.31-12-2025వ తేదీ ఉదయం 10.30 గంటలకు పైకోర్టుకు హాజరు అయి మీ ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేనియెడల దావా మీ పరోక్షమందు విచారించబడును.

కర్రిపాలెపు కళ్యాణి,
అడ్వకేటు, ఏలూరు.